పత్తి మిల్లుల్లో ఫైర్ సేఫ్టీ నిల్!

- అగ్ని ప్రమాదాలకు నిలయంగా ఆరుబయట పత్తి
- మూడు రోజుల్లో రెండు మిల్లుల్లో ప్రమాదాలు
- సీసీఐ కేంద్రాల్లోనూ నిర్లక్ష్యమే?



నెల్లుట్ల సమీపంలోని ఓ పత్తి మిల్లులో ఆరు బయట ఉన్న పత్తి కుప్ప



ఇటీవల ఓం శాంతి పత్తి మిల్లులో జరిగిన అగ్ని ప్రమాదంలో మంటలు ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

లింగాలఘణపురం: పత్తి మిల్లుల్లో అగ్ని ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. జిల్లాలోని 15 పత్తి మిల్లులు ఉండగా మూడు రోజుల వ్యవధిలోనే రెండు మిల్లుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. అందులో తాజ్ శైలానీ మిల్లులో జరిగిన ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లింది. జిల్లాలోని 15 పత్తి మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 2,60,494 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అదే విధంగా వ్యాపారస్తులు 1,05,020 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు డీఎంఓ నరేంద్ర తెలిపారు. అన్నీ పత్తి మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఉన్నప్పటికీ అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన ఫైర్ సేఫ్టీపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆయా మిల్లుల్లో పత్తి ఆరుబయట కుప్పలుగా పోసి పెట్టారు. ఒకవేళ ఏదైన అగ్ని ప్రమాదం జరిగితే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవడం లేదు.

ఫైర్ సేఫ్టీ లేని మిల్లులే ఎక్కువ..

జిల్లాలోని పత్తి మిల్లులకు కనీస ఫైర్ సేఫ్టీ లేని మిల్లులే ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ సీసీఐ అధికారులు పత్తి కొనుగోలుకు అనుమతి ఇవ్వడం విడ్డూరంగా ఉంది. ముఖ్యంగా పత్తి మిల్లుల్లో లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంక్, జనరేటర్, డీజిల్ పంపు, సీఓటు కెమికల్స్, కనీసం 30 ఎక్స్‌టింగ్విషర్స్ ఉండాల్సి ఉంటుంది. జిల్లాలోని ఏ ఒక్క మిల్లుకు కూడా సరైన సేఫ్టీలేదనే విమర్శలున్నాయి.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..

జిల్లాలో చాలా పత్తి మిల్లుల్లో ఫైర్‌సేఫ్టీ నిర్వహణ సరిగా లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అలాగే పత్తి మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడికి కూడా లెటర్‌తో తెలియజేస్తాం. ఫైర్‌సేఫ్టీ లేని మిల్లుల్లో ఏదైన ప్రమాదం జరిగితే ఇబ్బంది ఉండే అవకాశం ఉంది.

– శ్రీరాములు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, జనగామ

రెండు వాహనాలతో పాటు కొత్త మిషనరీ ఉండాలి



జిల్లాలో ఉన్న అగ్ని మాపక కేంద్రంలో ఒకే వాహనం ఉండడంతో పాటు గతంలో పాత మిషనరీ ఉంది. దాంతో ఎక్కువ దూరం వాటర్‌ను పంపింగ్ చేయలేకపోతున్నారు. అంతేకాకుండా ఒకే వాహనంతో ఇబ్బంది అవుతుంది.. రెండు వాహనాలు ఉండాలి. ఇటీవల బట్టల దుకాణాల ఘటన మంటలు ఆర్పడంతో తేటతెల్లమైంది.

– మోకు కనకారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

మాతాశిశు సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మల్లీశ్వరి

కొడకండ్ల: మాతాశిశు సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని ఐసీడీఎస్ సూపరువైజరు మల్లీశ్వరి కోరారు. సోమవారం మండలకేంద్రంలోని 1,2,3వ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన ఈసీసీఈ డే కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణి, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మహమూదాబేగం, ఉప్పల లక్ష్మీ, గర్భిణీ, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పలువురు బాధిత కుటుంబాలను సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దూసరి సాయిబాబా, ఏనుగుల కర్ణాకర్ కుటుంబాలను పరామర్శించి బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఇర్రి రమణారెడ్డి, గంగం సతీష్‌రెడ్డి, కోనేటి స్వామి, మూసిని సునీత, మూసిని శ్రీశైలంగౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై కళాజాతా



పాట పాడుతున్న కళాకారులు

లింగాలఘణపురం: కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాలపై సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం, నెల్లుట్ల, జీడికల్‌లో ఆరు గ్యారంటీల అమలుపై ఆట పాటలతో కళా జాత నిర్వహించారు. ఉచిత బస్సు, రుణమాఫీ, గృహజ్యోతి, ఉద్యోగ కల్పన వంటి వాటిపై ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి టీమ్ లీడర్ రత్నం, గణేష్, కనకరాజు, శ్రీనివాసు, పద్మ, చామంతి, మమత తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వైద్యశిబిరం



జనగామ: మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్ పుట్టినరోజు పురస్కరించుకుని పట్టణంలో ధర్మకంచ అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో మై హెల్త్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్,చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత నాగచారి, చెంచారపు బుచ్చిరెడ్డి, గాదెపాక రామచందర్, బొట్ల శ్రీనివాస్, బొట్ల నర్సింగరావు, గంగం నర్సింహారెడ్డి, రాజమౌళి, బడికె ఇందిరా, కృష్ణస్వామి, లక్ష్మీనారాయణ, బాల్‌రెడ్డి, ఎండీ జమాల్ షరీఫ్ పాల్గొన్నారు.

నేడు గ్రామ పంచాయతీ ఎన్నికల సమావేశం

బచ్చన్నపేట: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రత్యేక సమావేశాన్ని నేడు (మంగళవారం) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జున్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశానికి మండల పరిధిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని అన్నారు. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరుకానున్నారని తెలిపారు.

మార్కండేయ స్వామికి పూజలు



చిల్పూరు: చిన్నపెండ్యాలలో ఇటీవల నూతనంగా నిర్మించిన భక్త మార్కండేయ స్వామిని సోమవారం అఖిలభారత, పద్మశాలి సంఘం అనుబంధ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మురళి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఉత్సవకమిటీ అధ్యక్షుడు పేరాల రాజమౌళి, ఉపాధ్యక్షుడు బత్తుల రాజన్‌బాబులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వన్నాల సాగర్, పెద్ద కుమారస్వామి, చంద్రమౌళి, రాజమౌళి, యుగందర్, మందరాజు, రాంబాబు, రఘునాథ్, సత్యనారాయణ, నారాయణ పాల్గొన్నారు.

బారులుదీరిన పత్తి లోడు వాహనాలు



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామ సమీపంలోని చిన్నపెండ్యాల-తరిగొప్పుల రహదారిలో ఉన్న సిరి కాటన్ మిల్లు ముందు సోమవారం కిలోమీటరుకు పైగా పత్తి లోడు వాహనాలు నిలిచిపోయాయి. ఒక్కసారిగా వాహనాలు రావడంతో సిబ్బంది టోకెన్లు ఇచ్చి ఎవరికి ఇబ్బంది లేకుండా వాహనాల్లోని లోడ్‌ను దింపారు.

సన్మానం



జనగామ రూరల్: జిల్లాలోని రఘునాథపల్లి మండల సమాఖ్య సౌత్ జోన్ స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుపొందింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్‌సింగ్‌లను సమాఖ్య మహిళలు అవార్డుతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళలను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

చర్య తీసుకోవాలి

అనుమతులు లేని పాఠశాలల పేరుతో ఐ.డీ కార్డులు చేయించి సమాజంలో మోసాలకు పాల్పడుతున్న వైష్ణవి హైస్కూల్‌ను మూసివేసి పాఠశాల యజమాన్యంపై చర్య తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభి గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రం అందజేశారు.

మహాసభను జయప్రదం చేయండి

దేవరుప్పుల: హైదరాబాద్‌లో తలపెట్టిన దివ్యాంగుల విజృంభణ మహాసభను జయప్రదం చేయాలని వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ స్వామి, మండల కన్వీనర్ భూక్య యాకుబ్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కామారెడ్డిగూడెం బస్‌స్టేజీ వద్ద మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల హక్కులు అమలు చేసేందుకు పోరాటమే ఏకైక మార్గమన్నారు. శ్రీను సీమా, రవి, మెద సుధాకర్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గోదావరి నీటిని పరిశీలిస్తున్న బాల్‌రెడ్డి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల చెరువులను నింపాలన్నదే లక్ష్యమని ఇందుకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా నీటిని మండలంలోని కొన్నె గ్రామం నుంచి మీదుగా నాగిరెడ్డిపల్లి, గంగాపూర్, ఆలింపూర్ గ్రామాల చెరువులతో పాటు పడమటికేశ్వాపూర్, బచ్చన్నపేట, పోచన్నపేట చెరువులను నింపడానికి మళ్లించామన్నారు. నల్లనాగుల వెంకటాచారి, ఎద్దు హరీష్, కర్ణాకర్‌రెడ్డి, సందెల రాము, అఖిల్‌మాల, మహేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

మహబూబాబాద్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు



మహబూబాబాద్‌కు తరలి వెళ్తున్న నాయకులు

దేవరుప్పుల : లగచర్ల దళిత, గిరిజన రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మహబూబాబాద్‌లో తలపెట్టిన బీఆర్ఎస్ నిరసన కార్యక్రమానికి మండల నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా పల్ల సుందర్‌రామిరెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలంలోనే రేవంత్‌రెడ్డి సర్కార్‌కు ప్రజల తిరుగుబాటు రావడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతుందన్నారు. బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, మండల నాయకులు బస్వ మల్లేష్,చింత రవి, కృష్ణమూర్తి, ఎల సోమసుందర్, నర్సింహులు, అమర్‌సింగ్, అర్జున్, దేవా, గేమా, ఉపేందర్, గండిపెల్లి యాకయ్య,రాజన్న, భావ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

పశు వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి



మందులు ఇస్తున్న డాక్టర్ శ్రీకాంత్

జనగామ రూరల్: పాడిరైతులు పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. జనగామ మండలంలోని ఎర్ర గొల్లపాడు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పాడి రైతులు గ్రామాల్లో గోపాలమిత్ర సేవలను వినియోగించుకోవాలన్నారు. పశుగణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ ఎ.జయపాల్‌రెడ్డి, స్థానిక విజయ పాల కేంద్రం అధ్యక్షుడు రామచంద్రం, గోపాలమిత్రలు శ్రీలత, అబ్బయ్య, కె హర్ష, రాములు, నజీర్ పాల్గొన్నారు.

ఇప్పగూడెం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా..



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి



చిల్పూరు: చైర్మన్, ధర్మకర్తలతో ఎమ్మెల్యే కడియం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసేలా శాయశక్తులా కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో నెలకొన్న సమస్యల్ని ప్రజల నుంచి స్వయంగా తెలుసుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కడియం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామానికి చెందిన పలువురు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యల్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యల్ని సమస్యల ప్రాధాన్యతను బట్టి పరిష్కరిస్తామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. పీఆర్ డీఈ రాజగోపాల్‌రావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయశ్రీ, పీఆర్ ఏఈ రామక్రిష్ణ, సెక్రటరీ సంతోష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, నాయకులు కత్తుల కట్టయ్య, మునిగెల రమేష్, మండపురం ఎల్లగౌడ్, గొడుగు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషిచేయాలి

చిల్పూరు: చిల్పూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషిచేయాలని, అందుకు తన సహాయ సహకారాలను ఎప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించగా కడియం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా భువనగిరి డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి ధర్మకర్తలు ఆలయ ప్రధాన అర్చకులు రవీందర్‌శర్మ, గోలి రాజశేఖర్‌గుప్త, చల్ల వెంకటరమణాదేవి, తాళ్లపల్లి బుచ్చయ్య, పుల్యాల నారాయణరెడ్డి, గనగోని రమేష్, భూక్య శ్రీనివాస్, వేముల వెంకటేశ్వర్లు, పులికాశి రాజయ్య, మోతె మహేష్, కొలిపాక రాజు, ఎడమ అశోక్, చెట్కూరి రవి, ఎనగందుల రత్నాకర్‌రెడ్డిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ ఎన్నిక కోసం గోలి రాజశేఖర్‌గుప్త ప్రతిపాదించగా, వేముల వెంకటేశ్వర్లు అంగీకారం తెలుపడంతో చైర్మన్‌గా పొట్లపల్లి శ్రీధర్‌రావును ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కడియం, ఈఓ భాగం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో ఎండో మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రావుతో చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి, అందరి సహకారంతో దేవాలయంలో భక్తులకు కావాల్సి రీతిలో సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం చైర్మన్ కార్యాలయాన్ని కడియం ప్రారంభించారు. చైర్మన్ శ్రీధర్‌రావును ఆలయ ధాత సంగోజు మోహన్-శంకర్‌లక్ష్మి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ మార్నేని వెంకటేశ్వరరావు, గొల్లపల్లి వాసు, సమ్మెట మహేందర్‌లతో పాటు మల్లారెడ్డి,పోలేపల్లి రంజిత్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజుర, కుంచాల సంపత్‌రాజు, మూల సంపత్, జూనియర్ అసిస్టెంట్ మోహన్ పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

జనగామ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల నందు ఐహెచ్ఎఫ్ఎంఎస్– ఈ టెండర్లు కోరనైనదని కళాశాల ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ వివరాలు http://tender.telangana. gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆసక్తి, అర్హత గల వారు దరఖాస్తు చేసుకోగలరని పేర్కొన్నారు. ఈనెల 27న బిడ్ డ్యాంకుమెంట్ డౌన్ లోడ్ ప్రారంభం, టెండర్ల అప్లికేషన్ చివరి తేదీ డిసెంబర్ 11 అని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే ఈ మెయిల్ ఐడీ gmcjgn@ gmail.com ద్వారా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలి

- కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ



మాట్లాడుతున్న వెంకటరమణ

జనగామ రూరల్: బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ ప్రభుత్వాన్ని చేశారు. ఈనెల 30న జిల్లా కేంద్రంలో గాయత్రి గార్డెన్స్‌లో జరిగే కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. వరంగల్‌లో జరిగిన ఏడాది ప్రజాపాలన సభలో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో బెల్ట్ షాపులు లేకుండా చేస్తామని చేసిన ప్రకటనకు కట్టుబడి ఉండాలని కోరారు. బెల్టుషాపులతో లక్షలాది మంది ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు, ఆర్థికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్టుషాపులను అరికట్టాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి కార్యదర్శులు,బాల్నె వెంకట మల్లయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభాకర్, రాజయ్య, భాస్కర్, శ్రీనివాస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు



జనగామ: భోళాశంకరుడిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు



జనగామ: సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

జనగామ: కార్తీక మాస పర్వదినం పురస్కరించుకుని చివరి సోమవారం పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదం స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



జనగామ: సంతోషీమాత ఆలయంలో..



జనగామ: నందీశ్వరుడికి పూజ చేస్తున్న భక్తులు



జనగామ: ఉసిరిచెట్టు వద్ద పూజ, కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠాపన



హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనలో దాత రవీంద్రనాయక్‌తో రాజయ్య



పల్లకీ సేవ నిర్వహిస్తున్న పూజారులు, భక్తులు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని వేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి కొండ దిగువన రామాలయం పక్కన దాత లకావత్ రవీంద్రనాయక్–సుభద్ర దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కనులపండువగా సోమవారం జరిగిందిరు. మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలను నిర్వహించి చివరి రోజు విగ్రహప్రతిష్ఠ చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో దాతలు రవీంద్రనాయక్ సుభద్ర దంపతులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యతోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, భక్తులు, గ్రామస్తులు వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు.

లక్ష్మీనర్సింహస్వామి పల్లకీ సేవ

మండల కేంద్రంలో పడమర కొండ దిగువనున్న లక్ష్మీనర్సింహ సీతారామచంద్ర స్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి పల్లకీ వైభవంగా నిర్వహించారు.